క్లుప్తంగా

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుదాం



ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సుల్తానాబాద్: పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత గౌడ్ అన్నారు. ఆదివారం పలు కాలనీల్లో ఫాగింగ్ యంత్రంతో స్ప్రే నిర్వహించారు. ఇంటి చుట్టు పక్కల పారిశుధ్య కార్మికులు ట్రాలీలో వచ్చినప్పుడు వ్యర్థాలు వేయాలన్నారు. వ్యర్థాలను బయట వేయడం మూలంగా దోమలు తయారై పలు రకాల రోగాలు వస్తాయని వివరించారు. డెంగీ, మలేరియా ఇతర వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుధ్యం పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గుంతలు పూడ్చివేత



గుంతలు పూడ్చుతున్న నల్ల మనోహర్ రెడ్డి యువకులు

సుల్తానాబాద్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం మూల మూలవు వద్ద రోడ్డుపై భారీగా గుంతలు పడడంతో స్థానికులు, వివిధ గ్రామాల ప్రజలు నల్ల ఫౌండేషన్ చైర్మన్ నల్ల మనోహర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆదివారం స్వయంగా యువకులతో కలిసి మనోహర్‌రెడ్డి శ్రమదానం చేసి గుంతలు పూడ్చి వేశారు. కార్యక్రమంలో నాయకులు బైరగోని ప్రభాకర్ గౌడ్ ,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐలయ్యయాదవ్

ఓదెల: మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి దేవస్థానంలో మార్చి 12న జరిగే తెలంగాణ ఆత్మగౌరవ సదస్సు పోస్టర్‌ను జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమకారుల సంక్షేమాన్ని విస్మరించారని, కనీసం గౌరవం కూడా ఇవ్వటం లేదన్నారు. కార్యక్రమంలో తొట్ల సతీష్‌యాదవ్, బండ నిఖిల్‌యాదవ్, పెద్దిరెడ్డి రాజిరెడ్డి, సమ్మయ్య, బాపు, కుమార్, మొగిలి చేరాలు పాల్గొన్నారు.

మిత్రుడి వైద్య చికిత్సకు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

కాల్వశ్రీరాంపూర్: తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు అనారోగ్యానికి గురై ఆపదలో ఉన్నాడని తెలుసుకున్న స్నేహితులు తలో కొంత పోగు చేసి ఆర్థిక ఆదివారం ఆర్థికసాయం అందించారు. మండలంలోని గంగారం గ్రామానికి చెందిన కె కొమురయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యఖర్చులకు చిల్లిగవ్వలేక నిస్సహాయ స్థితిలో ఉన్న ఆకుటుంబానికి 1988–89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న బ్యాచ్ పూర్వ విద్యార్థులు అందరూ కలిసి రూ. 25 వేలు అందించారు. కార్యక్రమంలో టి ప్రవీణ్, కె రంజిత్ రెడ్డి, ఎం అశోక్, డి శ్రీనివాస్, కె రాజేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రామగిరి: మండలం లొంకకేసారం సర్పంచ్ ఎండీ. మంజూరు భార్య సాలెహ బేగం ఆదివారం గుండెపోటుతో మృతి చెందగా, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు.

జూలపల్లి: మండలంలోని నాగులపల్లె గ్రామానికి చెందిన నిరుపేద కందుకూరి సంపత్ కుమారుడు అజయ్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు కందుకూరి వెంకటయ్య రాజేశం ఉన్నారు.

ప్రయాణికులకు సదుపాయాలేవి?

- మండుతున్న ఎండలు
- తాగేందుకు మంచినీరు కరువు
- ప్రయాణికుల ఇబ్బందులు
- ప్లాట్‌ఫాంలపై షెడ్లు లేక ఇబ్బందులు
- నిరుపయోగంగా మరుగుదొడ్లు



నీడ లేని కొలనూర్ రైల్వేస్టేషన్

ఓదెల: కాజీపేట్ బల్లార్షా సెక్షన్ల మధ్య లోని రైల్వే స్టేషన్లలో కనీస సదుపాయాలు లేక ప్రయాణికులు అల్లాడుతున్నారు. రైల్వే స్టేషన్లలో సరైన వసతులు కల్పించడంలో రైల్వే అధికారులు విఫలమయ్యారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలోని ఓదెల, కొలనూర్, పొత్కపల్లి రైల్వేస్టేషన్లతో పాటు పలు రైల్వేస్టేషన్లలో కనీస సౌకర్యాలు లేకపోవటంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఓదెల, కొలనూర్, పొత్కపల్లి రైల్వేస్టేషన్లలో సికింద్రాబాద్, కాజీపేట్, భద్రాచలం రోడ్ నుంచి బల్లార్షా, సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య భాగ్యనగర్, ఇంటర్ సిటీ, సిర్‌పూర్ కాగజ్ నగర్ ఎక్స్‌ప్రెస్, రామగిరి, సింగరేణి రైళ్లు నడుస్తుంటాయి. నిత్యం వేలాది మంది ప్రయాణం చేస్తుంటారు. ప్రయాణికులకు రైల్వేస్టేషన్లలో నీడ సౌకర్యం కరువైంది. మండుతున్న ఎండలతో పిల్లలు, పెద్దలు రైలు వచ్చేంతవరకు ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్‌ఫాంలు పెంచినప్పటికీ షెడ్ల సౌకర్యం పెంచటం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రైల్వేస్టేషన్లో సమీపంలోని చెట్ల కింద సేద తీర్చుకుంటున్నారు. ఓదెల, పొత్కపల్లి, కొలనూర్ రైల్వేస్టేషన్లో కేవలం నల్లాలు మాత్రమే దర్శనమిస్తాయి. అందులో నీళ్ల రాకపోవటంతో చుట్టు పక్కల వ్యవసాయ బావుల పైన హోటళ్లపైన ఆధారపడి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూత్రశాలలు, మరగుదొడ్లలో నీటిసౌకర్యం లేక సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారాయి. మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేకసార్లు ప్రయాణికులు మూత్రశాలలు, మరగుదొడ్ల విషయంలో ఉన్నతాధికార్లకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. రైల్వేస్టేషన్లో క్యాంటిన్ సౌకర్యాలు లేక దూరప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పనిచేసిన క్యాంటిన్లను పునరుద్ధరించాలని, రైళ్లు ఎప్పుడు వస్తాయో అనౌన్స్ సిస్టంను రెగ్యులర్‌గా చేయాలని, రైళ్లు రద్దయితే వెంటనే ప్రచారం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా మరుగుదొడ్లు

ప్రయాణికుల నరకయాతన



ముదిరిన ఎండలకు ప్రయాణికులు మాడిపోతున్నారు. ప్రయాణికులకు షెడ్లు లేకపోవటంతో నరకయాతన పడుతున్నాం. ప్లాట్‌ఫాం పెంచిన రైల్వేశాఖ అదే రీతిలో షెడ్ల నిర్మాణంలో విఫలమైంది. ప్రయాణికుల రద్దీకి అనుకూలంగా సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

– జీగురు సదయ్య, కొలనూర్

సౌకర్యాలు మెరుగుపర్చాలి



రైల్వేస్టేషన్లనో ప్రయాణికులకు కనీస సౌకర్యాలను మెరగుపరచాలి. మంచినీటి, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక పోవటంతో బయట ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అవసరాలకు బయటకు వెళ్తే రైళ్లు వెళ్లి పోతున్నాయి. రైల్వేశాఖ ప్రయాణికుల ఇబ్బందులను తీర్చాలి.

– కర్క మోహన్‌రెడ్డి, పొత్కపల్లి

షెడ్లు ఏర్పాటు చేయాలి



రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు నీడ గురించి షెడ్ల సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఎండలకు ప్రయాణికులు తట్టుకోలేక వడదెబ్బకు గురవుతున్నారు. ప్రయాణికులకు నీడ సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఆదాయం వస్తున్న సౌలత్‌ల విషయంలో పట్టించుకోవడం లేదు.

– గుండేటి శంకర్, ప్రయాణికుడు ఓదెల

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని,పథకాలు నచ్చి ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. మండలంలోని ఆశన్నపల్లె గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వార్డు సభ్యులు తీగల సంపత్, కూస నాగరాజు, పెండ్లి తిరుపతి, మంద రంజిత్, శంకర్, కుమార్, సాగర్, హరీష్ కదురు రాజయ్య మరో యాభై మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్లు రాంచదంద్రా రెడ్డి, పురుషోత్తం, ఎంపీటీసీ పెండ్లి సంపత్, సర్పంచ్ మంద రమ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని రామునిపల్లిలో ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.9 లక్షలతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. సీఎం కేసీఆర్ గ్రామాలు పరిశుభ్రత, పచ్చదనం వెల్లివిరిసేలా ఉండేందుకు పల్లె ప్రకృతి వనాలు, డ్రెయినేజీలు, సీసీ రోడ్లకు ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చి నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో పెద్దపల్లి డీసీపీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీసీపీ

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం స్టేడియంలో ఆదివారం ధ్రువ పాండవు జట్టు, టూటౌన్ పోలీసుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. మ్యాచ్‌కు పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రికెట్ మ్యాచ్ ప్రారంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ధ్రువ పాండవు జట్టు 20 ఓవర్లలో 177 పరుగులు చేయగా, తర్వాత టూటౌన్ పోలీస్ జట్టు 20 ఓవర్లలో 166 పరుగులు చేసింది. డీసీపీ వైభవ్ గైక్వాడ్ బ్యాటింగ్ చేసి 26 పరుగులు చేశారు. గెలుపొందిన ధ్రువ పాండవు జట్టు క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్సైలు శ్యామ్ పటేల్, కళాధర్ రెడ్డి, సీనియర్ క్రీడాకారుడు నరసింహారెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆనందం.. తల్లిదండ్రుల మమకారం



సందడిగా మారిన కేజీబీవీ

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల హైస్కూల్లో ఆదివారం సెలవు దినం కావడంతో తలిదండ్రులు హాస్టల్‌కు వచ్చి తమ చిన్నారులను కలిసి వారి బాగోగులు తెలుసు కున్నారు. ప్రతి నెల చివరి ఆదివారం తాము వచ్చి ఆడపిల్లలకు తలదువ్వి నూనె రాసి వెళ్తామని తల్లి దండ్రులు పేర్కొన్నారు. నెలలో చివరి ఆదివారం తప్పితే ఇతర రోజుల్లో కలుసుకునే అవకాశం ఉండదని తల్లిదండ్రులు వాపోయారు.

ప్యాసింజర్ రైళ్లు పునఃప్రారంభం

రామగుండం: కాగజ్‌నగర్ సమీపంలో రైల్వేట్రాక్ పునరుద్ధరణ పనులు పూర్తి కావడంతో ఆదివారం నుంచి ప్యాసింజర్ రైళ్లను పునఃప్రారంభించారు. కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, ఇంటర్‌సిటీ, పుష్పుల్, సింగరేణి, రామగిరి రైళ్లను పునరుద్ధరించారు. రైల్వే ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

ఎస్‌బీఐ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మంథని: స్టేట్ బ్యాంకు సేవలను కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని మంథని వ్యవసాయ అభివృద్ధి శాఖ చీఫ్ మేనేజర్ వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మంథని మండలం కాకర్లపల్లి, సూరయ్యపల్లి, అక్కేపల్లితో పాటు పలు గ్రామాల్లో స్టేట్ బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. దేశంలో అత్యంత నమ్మకమైన బ్యాంకుగా కొనసాగుతోందన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ చెల్లిస్తున్నట్లు చెప్పారు. సర్వీస్ మేనేజర్ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ గురుకులాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ మహాత్మ జ్యోతి బా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విశ్వ విద్యాలయంలో 6 7 8 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రత్నాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు జూన్ 2లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 19 న ప్రవేశ పరీక్ష ఉండగా మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

సీపీఆర్‌ఎంఎస్ స్కీంలో అవకాశం కల్పించాలి

గోదావరిఖని: రిటైర్డ్ కార్మికులకు మరో సారి సీపీఆర్ఎంఎస్ స్కీంలో చేరే అవకాశం కల్పించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సింగరేణిలో 6వ వేజ్ బోర్డు నుంచి 9వ వేజ్‌బోర్డు మధ్య కాలంలో దిగిపోయి కార్మికులు రూ.40 వేలు చెల్లించలేక స్కీంలో చేరలేకపోయారన్నారు. ఈ మేరకు యాజమాన్యానికి ఉత్తరం రాశామన్నారు. డబ్బులు కట్టి స్కీంలో చేరే వారికి అవకాశం కల్పించాలని కోరారు.

ఘనంగా పోచమ్మ కొలుపు



పూజల్లో పాల్గొన్న జెడ్పీచైర్మన్ పుట్ట మధు

కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేటలో ఆదివారం గ్రామ దేవత పోచమ్మ కొలుపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల క్రితం బొడ్రాయి, భూదేవి ప్రతిష్ఠించి పోచమ్మ కొలుపు నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ వెంకటేష్, ఎంపీటీసీ గొడిసెల ఉమ, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, లింగాల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రామగిరి:మండలంలోని పన్నూరులో నిర్వహిస్తున్న పోచమ్మ కొలుపు ఉత్సవాలు భాగంగా ఆదివారం ముగిశాయి. శనివారం సాయంత్రం పంబాల పూజారులు పట్నం వేసి కొలుపు ప్రారంభించారు. గ్రామ పొలిమేర చుట్టూ బంధనం చేసి జంతుబలి(గావు)పట్టారు. గావుపట్టిన జంతువు(గొర్రె)తో గ్రామంలోని ఇంటింటా తిరుగుతూ బలి వేశారు. అనంతరం గ్రామస్తులు వన భోజనాలకు తరలివెళ్లారు.

అయ్యప్ప ఆలయంలో కుంభాభిషేకం

మంథని: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ 15 వార్షికోత్సవ వేడుకలు మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం పాంచజన్య వాయిద్యాలతో స్వామి వారి మేలుకొలుపు మొదలు హోమాలు, ప్రత్యేక పూజలను కేరళకు చెందిన సంజీవ్ నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాపు సంఘం మండల అడ్‌హక్ కమిటీ నియామకం



జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

రామగిరి: మున్నూరు కాపు సంఘం మండల అడ్‌హక్ కమిటీని ఆదివారం సెంటినరీకాలనీలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం హాల్‌లో జరిగిన సమావేశంలో నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్క రామస్వామి పటేల్ తెలిపారు. కమిటీ సభ్యులుగా తోట చంద్రయ్య పటేల్, కుడిది చెలం పటేల్, తోట శంకర్ పటేల్, కొమ్ము నాగయ్య పటేల్, చిట్యాల యాకూబ్ పటేల్‌లను నియమించినట్లు ఆయన వెల్లడించారు. సమావేశంలో నియోజకవర్గ మున్నూరు కాపు ఇన్‌చార్జి ఆకుల కిరణ్ పటేల్, నాయకులు దేవ శ్రీనివాస్ పటేల్, ఇసంపెల్లి రమేష్ పటేల్, బాకం రాజేశం పటేల్, కుడిది వేణు పటేల్, కామ తిరుపతి పటేల్, వివిధ గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమించి కాంపౌండ్ వాల్ నిర్మాణం



కాంపౌండ్ వాల్ నిర్మాణం

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రి నగర్ పరిధిలో రోడ్డును ఆక్రమించి కాంపౌండ్ వాల్ నిర్మించారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పట్టణం విస్తీర్ణం పెరగడంతో రోడ్లు వెడల్పు చేయాల్సి ఉండగా రోడ్డును ఆక్రమించుకున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. 30 ఫీట్ల రోడ్డు ఉండాల్సి ఉండగా ఇరువైపులా ఆక్రమణ కావడంతో రోడ్డు లేకుండా పోతుందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా విచారణ చేసి రోడ్డును ఆక్రమించుకున్న వారిపై చర్య తీసుకుని రోడ్డు అక్రమణ కాకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు.

జమాతే ఇస్లామీ హింద్ సేవలు గొప్పవి

గోదావరిఖనిటౌన్: జమాతే ఇస్లామీ హింద్ సమాజ సేవలో 75 ఏళ్లుగా ముందుందని రాష్ట్ర కార్యదర్శి మౌలానా అబ్దుల్ రఖీబ్ హమీద్ లతీఫ్ అన్నారు. ఆదివారం ఎస్.ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. మానవాళికి సేవ చేయడం అనేది ఇస్లామీ బోధనలో ముఖ్యమైన అంశమని, ముఖ్యంగా జమాత్ ఇస్లామీ హింద్ నిరుద్యోగం తదితర సామాజిక సమస్యలను రూపుమాపడానికి నిరంతరం శ్రమిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు షేక్ ఇషాక్‌అలీ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జవేరియా, స్థానిక అధ్యక్షురాలు మస్సరత్ ఆరా, కన్వీనర్ మెరాజ్ అహ్మద్, స్థానిక అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా, మజీద్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీఎల్‌పీ ఆధ్వర్యంలో బస్తీబాట

గోదావరిఖని: తెలంగాణ లేబర్‌పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మెయిన్ చౌరస్తా సమీపంలో బస్తీ బాట నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలను కలిసి పలు సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వెంకటేష్, భానుచందర్, జక్కం కవిత, రజిత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కమాన్‌పూర్: స్వర్ణకార సంఘం కమాన్‌పూర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడు సంగోజు చారి, ప్రధాన కార్యదర్శి బొజ్జ సంతోష్‌కు ధ్రువీకరణ పత్రాలను జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగు శ్రీనివాస్, శ్రీరామోజు రాజు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా స్వర్ణకార సంఘం కోశాధికారి కనపర్తి భాస్కరాచారి, గౌరవ అధ్యక్షుడు బసవపాత్రుని వెంకట నరసయ్య, ఉపాధ్యక్షులు బొజ్జ పురుషోత్తం, బొజ్జ రవీందర్, కార్యదర్శి బొజ్జ నరసింహచారి, మండల స్వర్ణకార సంఘం సభ్యులు బొజ్జ సత్తయ్య, ఇనుగుర్తి శ్రీరాములు, సద్దనపు సంపత్, బొజ్జ సతీష్, బొజ్జ వేణుగోపాల్ , రాజసాగర్ ,వేణు ,వెంకటేష్, సాగర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ అద్దె ఇంటిని సందర్శించిన నాయకులు

పెద్దపల్లిరూరల్: బాబాసాహెబ్ అంబేడ్కర్ 1912 నుంచి 1934 వరకు ముంబై పరేల్ బీఐటీ చాల్లో అద్దెకు ఉన్న ఇంటిని ఆదివారం పెద్దపల్లి నాయకులు బొంకూరి సురేందర్ సన్నీ, ఇమ్రాన్ సందర్శించారు. ఈ ఇంటికి 1919 డిసెంబర్17న కొల్హాపూర్ నుంచి రాజశ్రీ షాహు మహారాజ్ అంబేడ్కర్ ను కలిసేందుకు వచ్చారని స్థానికులు తెలిపారని సురేందర్ అన్నారు.ఈ భవనాన్ని జాతీయ స్మారక చిహ్నంగా మార్చేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించిందని పేర్కొన్నారు. ఈ డిమాండ్ అమలుకు తమ వంతుగా పోరాటం చేస్తామన్నారు.

అలయన్స్ క్లబ్ అధ్యక్షుడికి అవార్డు

ధర్మారం: అలయన్స్‌క్లబ్ ధర్మారం అధ్యక్షుడు తాళ్లపెల్లి సురేందర్‌గౌడ్‌కు ఇంటర్నేషనల్ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు లభించింది. విశాఖపట్నంలో లో జరిగిన అలయన్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ వార్షికోత్సవ సదస్సులో సురేందర్‌గౌడ్‌కు వందశాతం ఇంటర్నేషనల్ బెస్ట్ ప్రెసిడెంట్‌గా అవార్డును ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ చేతుగా మీదుగా తీసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ సిరిపురం సత్యానారాయణ, కార్యదర్శి మామిడిశెట్టి శ్రీనివాస్, పీఆర్‌ఓ నారాయణ పాల్గొన్నారు.

చెట్ల నరికివేత

సుల్తానాబాద్: హరితహారంలో నాటిన మొక్కలు చెట్లుగా మారాయి. మున్సిపల్ పరిధిలో నీరుకుల్ల రోడ్లు వెడల్పు చేస్తున్నారనే కారణంతో చెట్లను నరికి వేస్తున్నారు. మొక్కలతో కాలుష్యం నివారణతో పాటు పర్యావరణాన్ని పరిరక్షిస్తారని, నాటిన మొక్కలు నరకడం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాటిన మొక్కలు నరికిన ఒక మొక్కకు పది మొక్కలు నాటేలా అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మార్చి 2 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో మార్చి 2 నుంచి కరీంనగర్ ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మేరుగ రాజు, కురాకుల మల్లేశం, కుందెళ్ల ఓదెలు తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనే ఆసక్తి గల జట్లు రూ.2వేలు చెల్లించి జట్టు పేరును మార్చి 1లోపు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతకు రూ.40వేలు ప్రైజ్‌మనీ,షీల్డ్, రన్నర్‌గా నలిచిన జట్టుకు రూ.20వేల ప్రైజ్‌మనీ, షీల్డ్‌తోపాటు ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు వ్యక్తిగత ప్రైజ్‌లు అందజేయనున్నట్లు తెలిపారు. మేరిన్ని వివరిలకు 9550650272, 9951777556, 9573859375 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం





దొంగతుర్తి హైస్కూల్1992-93 బ్యాచ్, వెంకట్రావుపల్లి యూపీఎస్ 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు,టీచర్లు

ధర్మారం: మండలంలోని దొంగతుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఇదే పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. 30 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై అందరూ కలుసుకోవడంతో సందడిగా మారింది. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం పదో తరగతిలో ప్రతిభ చాటే విద్యార్థులకు సాయం అందిస్తామని పూర్వ విద్యార్థులు ప్రకటించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, మహాత్మా జ్యోతిబా పూలే విద్యాలయం ప్రిన్సిపాల్ జక్కని రాజేశం, ముత్యాల శ్రీనివాస్, శేషాద్రి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: వెంకట్రావుపల్లి యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 1990–91 బ్యాచ్ ఏడో తరగతి పూర్వ విద్యార్థులు సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఆదివారం "సమ్మేళనం నిర్వహించుకున్నారు. 32 ఏళ్ల తర్వాత కలుసుకుని వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జానకిరాం, రఘుప్రసాద్, సమ్మిరెడ్డి, సమ్మయ్య, లక్ష్మి, నిర్మల, నాగేశ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.